విద్యుత్ సమస్యలకు చెక్

- మండలంలో మూడు కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణం
- త్వరలో ప్రారంభం కానున్న పనులు


రామచంద్రాపురంలో స్థల పరిశీలన చేస్తున్న విద్యుత్ అధికారులు (ఫైల్)

బయ్యారం: ఎన్నో ఏళ్లుగా ఏజెన్సీలో నెలకొన్న లోఓల్టేజీ విద్యుత్ సమస్యకు కొత్తగా ఏర్పాటు కానున్న విద్యుత్ సబ్‌స్టేషన్లతో ఫుల్‌స్టాప్ పడనుంది. రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మండలంలోని రామచంద్రాపురం, కొమ్మవరం(ఇసుకమేధి), లక్ష్మీనర్సింహాపురం గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పూర్తిచేశారు. వీటిలో రామచంద్రాపురం, కొమ్మవరం సబ్‌స్టేషన్ల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా లక్ష్మీనర్సింహాపురానికి శాఖాపరమైన అనుమతి వచ్చింది. 5ఎంవీఏ సామర్థ్యంతో నిర్మించే ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3నుంచి రూ.4కోట్లు విద్యుత్‌శాఖ వెచ్చించనుంది.

తొలగనున్న ఇబ్బందులు..

మండలంలోని 29 పంచాయతీలకు ప్రస్తుతం బయ్యారం, కొత్తపేట, కంబాలపల్లి సబ్‌స్టేషన్ల నుంచి గృహ, వ్యవసాయ, వాణిజ్య విద్యుత్ సరఫరా అవుతుంది. బయ్యారం సబ్‌స్టేషన్ నుంచి బయ్యారం పట్టణం, వెంకట్రాంపురం, బాల్యాతండా, బాలాజీపేట, గౌరారం, గురిమెళ్ల, ఉప్పలపాడు, నర్సాతండా పంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ గ్రామాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సైతం అధికంగా ఉండడంతో లోఓల్టేజీ సమస్య వస్తుంది. వీటి పరిధిలో కొత్తగా లక్ష్మీనర్సింహాపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తే బయ్యారం సబ్‌స్టేషన్‌పై లోడు తగ్గనుంది. ఇదేవిధంగా కొత్తపేట, కంబాలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో నుంచి ఏజెన్సీ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయటం కష్టతరమవుతున్న పరిస్థితుల్లో కొత్తగా నిర్మాణం కానున్న రామచంద్రాపురం, కొమ్మవరం సబ్‌స్టేషన్లతో ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు తొలగనున్నాయి.

నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి..

మండలంలో కొత్తగా ఏర్పాటు కానున్న మూడు విద్యుత్‌సబ్‌స్టేషన్లతో రాబోయే పది సంవత్సరాల కాలంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉండవు. ఏజెన్సీ గ్రామాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులోకి రానుంది.

– నరేష్, ఎస్ఈ

సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి


తొర్రూరు: కొవ్వొత్తులతో సంతాపం తెలుపుతున్న నాయకులు


మహబూబాబాద్: వీరజవాన్లకు సంఘీభావం తెలుపుతున్న పెన్షనర్లు


గార్ల: మురళీనాయక్ మృతికి సంతాపం తెలుపుతున్న ఉపాధి కూలీలు

తొర్రూరు: దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న త్యాగాలు వెలకట్టలేనివని ఆయా పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. సరిహద్దుల్లో దేశం కోసం పోరాడుతూ ప్రాణాలర్పించిన వీర జవాను మురళీనాయక్‌కు శనివారం రాత్రి డివిజన్ కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. దేశ రక్షణ కోసం పోరాడి తెలుగు బిడ్డ వీర మరణం పొందడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు ఘనపురం రామకృష్ణ, ఎన్నమనేని శ్రీనివాసరావు, జైసింగ్, కర్నె నాగరాజు, కుర్ర శ్రీనివాస్, అనుమాండ్ల ప్రదీప్‌రెడ్డి, మాలోతు సురేష్, లకావత్ యాదగిరి నాయక్ పాల్గొన్నారు.

మహబూబాబాద్: విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీరజవాన్లకు సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు మైస నాగయ్య మాట్లాడుతూ.. సరిహద్దుల్లో పాకిస్తాన్‌తో పోరాడుతున్న సైనికులకు ప్రతీ ఒక్కరూ మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సోమయ్య, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, రఘుపతి, జి నారాయణ, మంగపతి రావు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మురళీనాయక్ మృతికి సంతాపం

గార్ల: భారత్–పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన ఏపీ వాసి వీరజవాన్ మురళీనాయక్‌కు బుద్దారం గ్రామ సమీపంలో ఉపాధి కూలీలు పని ప్రదేశంలో ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గూగులోత్ రాంబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గురుకులంలో అడ్మిషన్లు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఉన్న మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో ముస్లిం మైనార్టీలకు నేరుగా ఐదో తరగతి నుంచి 8వ తరగతి వరకు 2025–26 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లు వెంటనే అందిస్తున్నామని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ తెలిపారు. గురుకులంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. అర్హులైన విద్యార్థులు టీసీ, రికార్డు షీట్, కుల, ఆదాయం, నివాసం. ఆధార్‌కార్డులు, ఐదు పాస్ ఫొటోలు, రెండు జిరాక్స్ సెట్‌లు అందించి సీట్లు పొందవచ్చన్నారు.

గరుడవాహన సేవ



గూడూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నారాయణస్వామి దేవాలయంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మూడోరోజు గరుడవాహన సేవను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వేణుగోపాలాచార్యులు, హనుమాన్ మాలధారులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు అయిన వరి ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని తహసీల్దార్ కోడిచింతల రాజు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. స్థానిక సొసైటీ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించి, కాంటాలు అయిన ధాన్యాన్ని లారీలల్లో మిల్లులకు తరలించడాన్ని పరిశీలించారు.

సన్మానం



గంగారం: ములుగు ట్రైబల్ యూనివర్సిటీ లోగో డిజైన్ కమిటీ సభ్యుడిగా నియమితులైన కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఈసం నారాయణను శనివారం ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నారాయణరావు, పాపారావు, అనంతరావు, రామచందర్, సూరయ్య పాల్గొన్నారు.

భూమి పూజ



కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, రావుల మురళీ, ఆరెపల్లి గుట్టయ్య పాల్గొన్నారు.

చేపల గాలం గుచ్చుకుని బాలుడికి గాయం



మరిపెడ రూరల్: చేపల వేట సరదా ఓ బాలుడి చేతికి తీవ్రగాయాన్ని మిగిల్చింది. చేపలు పట్టేందుకు వెళ్లిన బాలుడిగా గాలం గుచ్చుకుని తీవ్ర గాయమైన సంఘటన మరిపెడ మండలం తాళ్లఊకల్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని తాళ్లఊకల్ గ్రామానికి చెందిన తప్పెట్ల శ్రీనివాస్ కుమారుడు వేసవి సెలవులు కావడంతో సరదా కోసం గ్రామ శివారు చెరువులో చేపలు పట్టేందుకు గాలం తీసుకొని వెళ్లాడు. అక్కడ చెరువులో గాలంతో చేపలు పడుతున్న క్రమంలో పొరపాటున గాలం శ్రీకరన్ అరచేతికి లోతుగా గుచ్చుకుంది. కుటుంబ సభ్యులు మరిపెడ పీహెచ్‌సీకి తరలించారు. గాలం రెండు వైపుల పదునుగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బాలుడిని 108 వాహనం ద్వారా ఖమ్మం తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక పూజలు

దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో గల పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత్– పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో మన దేశం విజయం సాధించాలని, సైనికులు ఆరోగ్యంగా ఉండాల పూజలు చేశారు. అర్చకులు రమణశర్మ, పవన్‌శర్మ పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ లక్ష్యం


ప్రశంసపత్రాలు అందజేస్తున్న ఆర్ఎం

తొర్రూరు: ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ సంస్థ లక్ష్యమని వరంగల్ ఆర్ఎం విజయభాను తెలిపారు. ఆర్టీసీ వరంగల్ రీజియన్ ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాల కార్యక్రమం శనివారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా డిపోలకు చెందిన డ్రైవర్లకు ప్రశంస పత్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. డీఎం పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్ఎం మాట్లాడారు. రవాణా వ్యవస్థలో అతి పెద్దదైన ఆర్టీసీ నిత్యం వేలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతుందన్నారు. డ్రైవర్‌గా విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు భాను కిరణ్, మహేష్, ఎంఎఫ్ విజయ్‌కుమార్, డీఎంలు ధరమ్‌సింగ్, శివప్రసాద్, ప్రసన్నలక్ష్మీ, ఇందు, జ్యోత్స్న, రవిచందర్, అర్పిత, ఎస్టీఐ రజితారెడ్డి, ఆయా డిపోల సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతి

గార్ల: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ మృతిచెందిన సంఘటన శనివారం పూసలతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం మర్రిగూడెం పంచాయతీ పూసలతండాకు చెందిన మాలోత్ వీరన్న(45) ఏఆర్ హెడ్‌కానిస్టేబల్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 8వ తేదీన హైబీపీతో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో హైదరాబాద్ తరలించి వైద్యం చేయిస్తుండగా తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ప్రొబెషనరీ ఎస్సై ఎస్‌డి మైబూబి తెలిపారు. వీరన్న మృతదేహాన్ని ఏఆర్ డీఎస్పీ విజయ్‌ప్రతాప్, మహబూబాబాద్ డీఎస్పీ ఎస్ తిరుమలరావు, సీఐ రవికుమార్, ఎస్సై ఎస్‌కె రియాజ్ పాషా సందర్శించి నివాళులర్పించారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని సోమ్లతండా గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లావుడ్యా జ్యోతి కుటుంబ సభ్యులందరూ తండాలోని ఓ వివాహ వేడుక ఉండగా అక్కడికి వెళ్లారు. కొద్ది సమయం తర్వాత జ్యోతి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. జ్యోతి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

వృథాగా భగీరథ నీరు


వృథాగా పోతున్న తాగునీరు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామం నుంచి మహబూబాబాద్ వైపునకు వస్తున్న మార్గంలో రహదారి పక్కనే ఉన్న మిషన్ భగీరథ పైపులైన్ లీక్ ఏర్పడి తాగునీరంతా వృథాగా పోతుంది. అసలే ఎండాకాలం ఆపై తాగునీరు వృథాగా పోతుందని, సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న విజయసారథి

కురవి: సీపీఐ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మండలంలోని బలపాల గ్రామంలో శుక్రవారం రాత్రి సీపీఐ గ్రామ శాఖ మహాసభ రామగోని రవి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 ఏళ్లుగా కేంద్రంలోని బీజేపీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని, నిరుద్యోగం పెరిగిపోయిందని తెలిపారు. అనంతరం గ్రామ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రామగోని రవి, సహాయ కార్యదర్శిగా బత్తుల వెంకటేశ్వర్లును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి కరణం రాజన్న, కన్నోజు వెంకటనారాయణ పాల్గొన్నారు.

గుంతల రోడ్డు


గుంతలమయంగా ఉన్న బీటీ రోడ్డు

గార్ల: గార్ల నుంచి బుద్దారం వెళ్లే బీటీ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గార్ల నుంచి డోర్నకల్ వెళ్లే ప్రధాన రహదారి సీతారామ ప్రాజెక్ట్, రైల్వే 3వ లైన్ నిర్మాణ పనుల కారణంగా రైల్వేగేటు మూసివేశారు. దీంతో డోర్నకల్ నుంచి గార్లకు వచ్చే వాహనదారులు రహదారి సక్రమంగా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి బీటీ రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తునికాకు కట్టకు రూ.5 చెల్లించాలి


గార్ల: మాట్లాడుతున్న నాయకులు

గార్ల: 50ఆకుల తునికాకు కట్టకు రూ.5చెల్లించాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బి.హరినాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మండ రాజన్న డిమాండ్ చేశారు. శనివారం గార్ల, బయ్యారం మండలాల్లోని సేరిపురం, నగరం, ఇరుసులాపురం గ్రామాల్లో తునికాకు కల్లాలను వారు సందర్శించి మాట్లాడారు. తునికాకు కార్మికుల పెండింగ్ బోనస్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీఎస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, వంగూరి వెంకటేశ్వర్లు, కార్మికులు చింత నాగరాజు, రామ్మూర్తి, బాబు, తదితరులు పాల్గొన్నారు.

బోనస్ చెల్లించాలి

బయ్యారం: పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్ డబ్బులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మండా రాజన్న, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్య హరినాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పలు తునికాకు కేంద్రాలను శనివారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ధాన్యం సేకరణ త్వరగా పూర్తి చేయాలి

తొర్రూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న వరి ధాన్యం సేకరణను త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ నర్సయ్య సూచించారు. శనివారం మండలంలోని చెర్లపాలెం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.

విద్యుదాఘాతంతో గేదెల మృత్యువాత



కురవి: మండలంలోని బీల్యా తండాకు చెందిన గన్నా, వెంకట్రాలకు చెందిన రెండు గేదెలు శనివారం మేత కోసం ఊరి బయటకు వెళ్లాయి. నల్లెల్ల శివారు సూర్య తండా శివారులోని ఓ చేనులో ఇటీవల గాలివానకు విద్యుత్ తీగలు తెగి కింద పడి ఉన్నాయి. మేత మేస్తున్న క్రమంలో విద్యుత్ తీగలకు తగిలి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. చారు. వీటి విలువ రూ.1.50లక్షలు ఉంటుందని రైతులు తెలిపారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి

బయ్యారం: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా శనివారం బయ్యారంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యాకన్న, మదార్, రాజన్న, జగ్గన్న, వీరభద్రం పాల్గొన్నారు.

గార్లలో..

గార్ల: మావోయిస్టులతో చర్చలు జరపాలని కోరుతూ శనివారం గార్ల పురవీధుల్లో వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాస్, విశ్వ, లక్ష్మణ్‌నాయక్, వెంకట్‌రెడ్డి, వెంకన్న, సక్రు, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మరిపెడ: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న అజ్మీర సుధీర్(20) మృతిచెందాడు. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో గురువారం అర్ధరాత్రి జరిగిన బైక్ ప్రమాదంలో భూక్య సంతోష్, గుగులోతు కార్తీక్‌లు అక్కడికక్కడే మృతిచెందగా వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ సుధీర్ శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

కంఠాయపాలెంలో గీత కార్మికుడు..

తొర్రూరు రూరల్: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడిచికిత్స పొందుతూ ఓ గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కంఠాయపాలెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది.. గ్రామానికి చెందిన పల్లె యాకన్న(48) పది రోజుల క్రితం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో హన్మకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

డోర్నకల్: మండలంలోని పెరుమాళ్లసంకీస గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పెరుమాళ్ల సంకీసకు చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టి వెంకన్న తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో మహబూబాబాద్ నుంచి పెరుమాళ్లసంకీస వస్తూ ఇళ్లు చేరే సమయంలో సంకీస సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న శెట్టి వెంకన్నతోపాటు భార్య జయమ్మ, కుమారుడు ప్రదీప్, మనవడు పండుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించారు.

తూము తెరిచిన గుర్తు తెలియని వ్యక్తులు

కేసముద్రం: కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి గ్రామంలోని నల్లకుంట నుంచి, ఇనుగుర్తి మండల కేంద్రంలోని ఓ చెరువు తూము నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శనివారం నీటిని విడుదల చేశారు. దీంతో వేసవిలో పశువుల దాహార్తికి, తాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అయితే విషయం తెలుసుకున్న ఇనుగుర్తి తహసీల్దార్ రవీందర్ ఇనుగుర్తిలోని చెరువు తూము వద్ద మట్టితో గండిని పూడ్చించి. నీళ్లు వృథాగా పోకుండా కట్టడి చేయించారు.

నూతన కమిటీ సభ్యులకు సన్మానం

మహబూబాబాద్ అర్బన్: నూతనంగా ఎన్నికైన మహబూబాబాద్ కిరాణ వర్తక సంఘం అధ్యక్షుడు సోమ రత్నశేఖర్, కార్యదర్శి కొండ్లె భద్రినాథ్, కోశాధికారి గుండా మధు రెడ్డిలను వాకర్స్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు చౌడవరపు సుధాకర్, పరకాల రవీందర్ రెడ్డి, ఆకుల రాజు, వీరన్న, మోహన్ రెడ్డి, బోనగిరి గంగాధర్, మాలె కాశీనాథ్ పాల్గొన్నారు.

సంఘాల అభివృద్ధిలో చెల్లింపులు కీలకం

నర్సింహులపేట: మహిళా సంఘాల అభివృద్ధిలో సభ్యుల చెల్లింపులు కీలకమని సమాఖ్య అధ్యక్షురాలు లింగాల శ్రీదేవి, ఉపాధ్యక్షురాలు పోపు రమాదేవి స్పష్టం చేశారు. పట్టణంలోని నెహ్రూ నగర్‌లోని కళాభారతి పొదుపు సంఘం 31వ వార్షిక మహోత్సవాన్ని అధ్యక్షురాలు మైస వసంత కుమారి అధ్యక్షతన శనివారం నిర్వహించగా శ్రీదేవి, రమాదేవి అతిథులుగా హాజరై మాట్లాడారు. రుణాలు తీసుకున్న సభ్యులందరూ సకాలంలో తిరిగి చెల్లించాలని సూచించారు. అనంతరం సంఘం లావాదేవీల నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న రావుల సుశీల, గుర్రపు అరుణలను అధ్యక్షులు, పాలకవర్గం శాలువాతో సత్కరించారు. అనంతరం అధ్యక్షురాలిగా ఆవుల విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా కాజీపేట అనితను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపునకు చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ సైదులు

మరిపెడ రూరల్: ధాన్యం తరలింపులో తహసీల్దార్ దొడ్డారపు సైదులు ప్రత్యేక చొరవ చూపుతున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షభావ పరిస్థితులు నెలకున్న నేపథ్యంలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశాల మేరకు తహసీల్దార్ సైదులు ఆధ్వర్యంలో రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, పోలీస్ అధికారుల సహకారంతో లారీలను సమకూర్చుతున్నారు. ఇప్పటి వరకు మరిపెడలోని ఐకేపీ, ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల నుంచి సుమారు 50వేల క్వాంటాళ్ల ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లర్స్‌కు తరలించారు. సన్నరకం ధాన్యాన్ని అబ్బాయిపాలెం రైస్ మిల్లుకు, దొడ్డురకం ధాన్యాన్ని తొర్రూరులోని రైస్‌మిల్‌కు వేగంగా తరలిస్తున్నారు. ఈసందర్భంగా శనివారం తహసీల్దార్ సైదులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మండల పరిధిలో ఏర్పాటు చేసిన ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలోని 16 కొనుగోలు కేంద్రాల నుంచి 50వేల క్వింటాళ్లు, లక్షా ఇరవై వేల బస్తాల ధాన్యాన్ని మిల్లర్స్‌కు తరలించినట్లు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో మిగిలిన ధాన్యాన్ని తరలింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు రైతులు సహకరించాలని, వర్షం వస్తే పట్టాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సకాలంలో ధాన్యం తరలింపునకు కృషి చేస్తున్న తహసీల్దార్ సైదులుకు రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం


తొర్రూరు: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తొర్రూరు: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను శనివారం డివిజన్ కేంద్రంలో టీయూసీఐ నాయకులు ఆవిష్కరించారు. రవి మాట్లాడుతూ.. ప్రధాని మోదీ తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లతో కోట్లాది మంది కార్మికులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వాలు కార్మిక సంక్షేమాన్ని గాలికి వదిలేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాం పుల్లయ్య, ఎండీ షరీఫ్, అర్వపల్లి వెంకన్న, గుండాల సోమనర్సయ్య, లక్ష్మయ్య, భీకు, మురళీ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: కార్మిక హక్కుల సాధన కోసం ఈనెల 20వ తేదీన చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సమ్మె పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వరిపెల్లి వెంకన్న, మంద శంకర్, వెలుగు శ్రావణ్, ఎస్కే జానీ, శ్యాంప్రసాద్, రమేశ్, మధుసూదన్ పాల్గొన్నారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ



మహబూబాబాద్ రూరల్: భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని పత్తిపాకలోగల ఎష్కోలు ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో శనివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. దేశ ప్రజలందరికి మేలు కలగాలని, అందరిపై క్రీస్తు అనుగ్రహం ఉండాలని పాస్టర్ బీఎస్ సామ్యేలు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.